# వెలుగా రేకేతి

అంబటిపూడి కమలాదేవి



'సరూ' రావడం ఎంత ఆశ్చర్యమనిపించిందో, ఆమె తెచ్చినవార్త అంతకంటే ఆశ్చర్యమనిపించింది.

'శేఖరం పెళ్లి చేసుకోబోతున్నాడట!' అపును మనిషన్నవాడు పెళ్లిచేసుకుంటాడు, పిల్లల్ని కంటాడు. అందులో ఏమీ ఆశ్చర్యంలేదు. మనిషి పుట్టడం చావడం ఎంత సహజంగా జరిగిపోతూ వుంటాయో అదీ అలాంటిదే. కాని శేఖరం విషయంలో 'పెళ్లి' అనేది కొంచెం ఆలోచింపజేసే విషయమే.

'పెళ్లయితే నీతోటే... బ్రతుకుంటే నీతోటే...నువు లేకపోతే నేనులేను.'

అనేవాడు శేఖరం, ఒకసారి కాదు, లక్షసార్లు, పాడిందేపాటగా, అరిగిపోయిన గ్రామఫోను రికార్డులా.

మరి ఇప్పుడు?

అతని పెళ్లట?

అతనికి నేనులేను...కాని నేను లేకపోయినంత మాత్రాన అతనికతను లేకపోలేదు. అతనూ వున్నాడు, నేనూ వున్నాను.

దూరదూరంగా ... అందని తీరాలలో. అతనన్న మాటల్లో అర్థమున్నా లేకపోయినా, అతనిమాట నిలిచింది. అది నా మనోఫలకం మీదనుంచి చెరగదు. ఆ ముద్ర చెరిగేదికాదు. నీళ్లమీద రాతలా అతని మాటమాత్రం విలువ పోగొట్టుకొంది.

కావాలని దగ్గరకొచ్చి, మురిపించి ఆశలు రేకెత్తించి-తీరా గాలివాన ఆరంభమయ్యాక నట్టనడి సముద్రాన వదిలి పారిపోయిన హీడినేమనాలి?

అతన్ని ఏమనడానికీ నాకు రాదు. ఇప్పటికీ నాకతను ఆరాధ్య దైవమే! నన్నూ నా ఆశల్నీ బుగ్గి చేసిన అతని మీద నాకింకా అభిమానమే వుంది. అదే నా బలహీనత. బహుశా ఈ బలహీనతనే అతను బాగా వుపయోగించుకుని వుంటాడు. నాలోనే గనక మనోబలం వున్నట్టయితే అతనెందు కంత దగ్గరగా రాగలుగుతాడు? దగా ఎలా చెయగలుగుతాడు?

'వచ్చి ఎంతసేపయిందో తెలుసా? ఆత్మారాముడి ఘోష భరించుకోలేకుండా వున్నాను. కాస్త కాఫీ నీళ్లయినా పోసేది వుందా లేదా?'

అంది సరోజ నన్ను కదుపుతూ.

ఆమె తెచ్చిన వార్త నన్ను వెనక్కి లాక్కుపోయింది. సరోజకి అతిధి మర్యాదలే మరచిపోయాను.

'సారీ సరూ...రాకూర్చో...క్షణంలో

కాఫీ చేసిస్తా"

అన్నాను కొంచెం అపాలజిటిక్‌గానే.

వాంచిన నా తలను చుబుకం పుచ్చుకుని ఎత్తింది సరూ...! కిల కిల మంటూ నవ్వేసింది నా ముఖంలోకి చూస్తూ.

సరోజది ఎంత మంచి జీవితం? ఆమెకు కష్టమనేది వుండదు. వచ్చినా, అంతగా పట్టించుకోదు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుండే స్వభావం, అలాంటి జీవితం ఏ కొద్ది మందికో తప్ప దొరకదు. ఎంతో పుణ్యం చేసుకుంటేగాని సరోజలాంటి జీవితం లభించదు. అందుకే సరోజ అంటే నాకంత ఇష్టం!

'వద్దులే రాధా... ఇపుడు నువ్వు కాఫీ ప్రయత్నాలేమీ చెయ్యొద్దు. నేను దారిలో తాగొచ్చా. ఇప్పుడు నువ్వేమీ అనవసరంగా బాధ పడక్కర్లేదు. అయినా. నాదే తప్పనుకో ... వస్తూ వస్తూనే వేరే విషయాలేమీ లేనట్టు శేఖరం గురించే చెప్పడం యేమిటి? పాపం...నువ్వెంత బాధ పడుతున్నావో ఏమో! నీ మనసు తెలిసున్నా, ఏదో నోరు జారి పోయింది నన్ను క్షమించు రాధా...

అంది, నా చేతులు పట్టుకొని సరోజ.

ఎందుకో నాకు కళ్లంట నీళ్లొచ్చేయి. ఆమె నాపై సానుభూతి చూపినందుకు కావచ్చు, లేదా శేఖరం జ్ఞాపకానికి వచ్చినందుకు కావచ్చు, లేదా రెండూ కావచ్చు.

సరోజ నా కళ్లు తుడుస్తుంటే ఆమె మీద ఎనలేని ప్రేమ పుట్టుకొచ్చింది. గట్టిగా కావలించుకున్నాను. అప్పుడు మరీ ఏడుపు వచ్చేసింది.

సరోజకి తెలుసు, నేనెంత తొందరగా ఏడ్చేస్తానో అంత ఆలస్యంగా తేరుకుంటానని. కాని, నా మనస్తత్వం పూర్తిగా ఎరిగున్న సరోజకి నా చేత నవ్వించడం పెద్ద కష్టమేమీ కాలేదు.

సరోజ దగ్గర ఏ మాయా మహత్యముందోగాని ఆమె మాటలు వింటూనే మంత్రముగ్ధనై పోతాను. సరోజ అప్పటికీ ఇప్పటికీ ఏం మారలేదు.

* * *

నాన్నకి అవసాన కాలం. పనిచేసే వోపికలేదు. అమ్మ రోగిష్టిది. వున్న ఉసిం కాస్తా అమ్మ మందులకి, అన్నయ్య తిరుగుళ్లకి హారతి కర్పూరంలా హరించుకుపోయింది. అన్నయ్య ఇంట్లోంచి పారిపోయాడు వున్న కాస్తా చేజిక్కించుకుని. చదువులోవున్న గౌరవ మర్యాదలు నాన్నకి బాగాతెలుసు. అందుకే నేను ఆడపిల్లనయినా డిగ్రీ తీసుకునే వరకూ చదివించారు. అమ్మ నాన్నల సంగతి అన్నయ్యకు పట్టలేదు. అందుకే వాడిదారి వాడు చూసుకున్నాడు. చదువయింతర్వాత నేను గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవడం తప్పితే చేయగల్గిందేమీ లేకపోయింది. నాన్న కన్నుమూశాక యింట్లో పరిస్థితి మరీ అగమ్యగోచరంగా కన్పించేది. ఒక్కోరోజు తినడానికే వుండేదికాదు.

అమ్మ కన్నుముయ్యదట! నా పెళ్లి చూసేవరకూ ఆమె ఎన్నాళ్ళయినా అలాగే బ్రతుకుతుందిట! అందుకే నేను పెళ్లి చేసుకోకూడదనుకున్నాను. వున్న పెద్ద దిక్కు ఆ వొక్క అమ్మకూడా పోతే నా బ్రతుకేం కాను? వున్నరోజుల్లో చుట్టపక్కాలంతా ఈగల్లా ముసిరారు. అంతా హరించుకు పోయిందిగా, ఇప్పుడు మేమంటూ వున్నామో లేమో ఎవరికీ అక్కరలేదు. నేనే మొగపిల్లవాడినై వుంటే ఎలా వుండేదో? నాకోసం కొంత మంది కాకపోతే కొంత మందయినా కాచుకు కూర్చునేవారు. ఆడదాన్నయి పోయానయ్యె...మా యింట్లోకి ఎవరు తొంగి చూసినా వారికి నా భారం అంట గట్టడానికి అమ్మసిద్ధంగా వుండేది. అలాంటి పరిస్థితుల్లో . నా గురించి పట్టించుకునే వాళ్లెవరు?

రోజురోజుకీ పరిస్థితులు మరీ కష్టంగా తయారవసాగాయి. మా యింటిముందు కాపలాలు ఎక్కువయ్యాయి. నన్నెవరన్నా ఎత్తుకు పోతారని మా వూళ్లో కుర్రకారుకి భయం పట్టుకున్నదిలావుంది. అనుమానం ఎవరో వొకరు మా యింటి ముందు బడ్డీ కొట్టుదగ్గర నాకు రక్షణ సదుపాయాలు చేస్తూ వుండేవారు. ఒకడి తరువాత ఒకడు......

అప్పుడే నాకనిపించింది, మా వూళ్లో యింకా నా యీడు పిల్లలు చాలామంది వున్నారుగా...లలిత... మీనా... వసంత... సుందరి...హేమ .. మరి వీళ్లందరి ఇళ్ల దగ్గరా ఇలా వడిగాపులువడి కావలి వుంటున్నారా? కాదు. మరి నాదగ్గరే ఇలా ఉండడానికి కారణమేమిటి?

అప్పటి నా ఆలోచనల్లో మొదటి సమస్య ఇది. నా అన్నవాళ్లెవరూ లేరు కదా...వొంటరిగా వున్నాను ... అందుకే ఇలా కుర్రకారుకి లోకువైపోయాను అనుకున్నాను కొంతకాలం. కాని ఆ తర్వాత రోజుకో ప్రేమలేఖ పోస్టున వస్తుంటే... నా మీద నాకే ఒకరకమైన విశ్వాసం ఆరంభమైంది. నేనూ అందగత్తెనే కాబోలు అనుకున్నా ఒకరోజున దృఢ విశ్వాసంతో అద్దం ముందు నిలబడి! అద్దంలో నా ప్రతిరూపం నాకు ఉత్సాహాన్నిచ్చింది. అదే నాకు కొండంత ఆత్మ స్థయిర్యాన్ని ప్రసాదించింది.

అమ్మ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణించసాగింది. స్థలం మార్పితే ఏమయినా ప్రయోజనం వుండొచ్చునని డాక్టరు సలహా. ఎలా? స్థలం మార్చాలంటే అసహాయురాలిగా వున్న నాకు సాధ్యమయ్యే పనా?

చేతిలో డిగ్రీవుంది. నాన్నకి కృతజ్ఞతలు తెల్పుకుంటూ కనబడిన వుద్యోగానికల్లా అడిగినా అడక్కపోయినా ఫోటోతోసహా అప్లికేషన్లు పంపడం మొదలెట్టాను.

ఇంటర్వ్యూ లేకుండానే కలకత్తా నుంచి వుద్యోగంలో చేరమని వుత్తరం వచ్చింది. అదే నా జీవితంలో మలుపు తిప్పించిన సంఘటన. ఆరోజున అన్ని దేవుళ్లకీ మొక్కుకున్నాను.

అమ్మతోసహా కలకత్తా వెళ్ళిపోయాను.

ఉద్యోగంలో చేరగానే పరిచయమైంది సరోజ. పరిచయమైన కొద్ది రోజుల్లోనే ఆత్మీయురాలని అనిపించుకొంది. నేనూ ఆమె సహవాసంలో ఎంత ఆనందాన్ని చూరగొన్నాను. ఇద్దరమూ ఒకటిగానే వుంటూవుండే వాళ్లం.

ఒకరోజు శేఖరాన్ని పరిచయం చేపించింది సరోజ. అతనేదో ఆఫీసులో మేనేజరుగా పని చేస్తున్నాడని చెప్పింది. అతనిపై నాకు ఎలాంటి అభిప్రాయమూ కల్గలేదు. అతనిని గురించి తర్వాతచెప్పింది సరోజ. చాలా పెద్ద ఉద్యోగమే.' అన్ని మంచి

లక్షణాలే. శేఖరం చాలా మంచివాడని తెలిసింది సరోజవల్ల.

మనిషిని ఊహించుకోలేక పోయాను. కారణం, అతను పరిచయమైనప్పుడు అంత అంత పరిశీలనగా చూడలేదు నేను. మంచి పర్సనాలిటీ వున్నట్టుగా అనిపించిందిగాని అతని రూపురేఖల్ని పూర్తిగా జ్ఞాపకం చేసుకోలేకపోయాను.

ఎందుకో అతనంటే ఒకరకమైన ఉత్సాహం వచ్చేది. అతన్ని మళ్లీ ఒకసారి చూస్తే బాగుండును అనిపించేది.

ఆ మర్నాడు సరోజతో మళ్లీ వచ్చాడతను. చూశాను. మనిషి చామనచాయ అయినా ఎంతో రాజసం. ఠీవి ఉట్టిపడే రూపం అతనిది. నా కంటికి చాలా బాగున్నాడు.

అదే అన్నాను సరోజతో.

సరోజ ముఖం ముడుచుకుపోయింది. తర్వాత గట్టిగా నవ్వేసింది. ఆమె తత్వమే అంత.

శేఖరం తరచూ వస్తూ వుండేవాడు. సరోజ కంటె నాతో ఎక్కువసేపు కాలక్షేపం చేస్తూ వుండేవాడు. అతనితో కబుర్లాడుతూ కూర్చుంటే గంటలు నిమిషాల్లా కదలిపోతుండేవి.

ఒకరోజు సరోజ అననే అనేసింది కూడా— 'కొంపదీసి ఇద్దరూ ఏమన్నా ప్రేమాయణం సాగించడం లేదు కదా...?' అని.

తర్వాత కొన్నాళ్ళకి ఆమె మాట అక్షరాలా నిజమయింది.

# వెలుగా చీకటీ

నేను శేఖరాన్ని ప్రేమిస్తున్నాను అని తెలుసుకునేప్పటికి—అతను నన్ను మరింత గాఢంగా ప్రేమిస్తున్నట్టు నాకు తెలిసిపోయింది.

అతనే అన్నాడు, ఒకరోజు ధైర్యం చేసి—

'నిన్ను ప్రేమిస్తున్నాను రాధా...నువ్వు అంగీకరిస్తే ఇద్దరం పెళ్లిచేసుకుందాం. పెళ్లయితే నీతోటే... బతుకుంటే నీతోటే...నువ్వు లేకపోతే నేను లేను...'

అన్నాడు. అతను తొందరపడి అలా అనివుండకపోతే నేనే అడిగేసివుండేదాన్ని. ఏమయితేనేం? మొత్తంమీద నాపని సులువయిపోయింది. నా కోరిక నెరవేరిపోయింది.

అతను మొదటిసారిగా తన ప్రేమని వ్యక్తంచేసిన రోజున వెయ్యి దీపావళులు విరబూశాయి. జీవితంలో మొట్టమొదటిసారిగా అంత ఆనందాన్ని చూడగల్గాను. అమ్మ పసిగట్టి అనేసింది కూడా — 'నీ ముఖంలో ఎప్పుడూలేనికళ వచ్చింది. నా కోరిక తీర్చేరోజు దగ్గర్లోనే వుందా ఏమిటి?' అని.

ఎక్కడలేని సిగ్గూ ఆవరించుకుంది నన్నప్పుడు. అమ్మతో చెప్పాను శేఖరం విషయం. అమ్మ ఎంతగానో సంతోషించింది.

సరోజతో చెప్పేశాను తనందరపట్టలేక. ఆమె నన్ను చాలా చాలా అభినందించింది.

తర్వాత చాలారోజులవరకు సరోజ నాకు కనిపించలేదు.

శేఖరం మా యింటికి వచ్చాడు. పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు అతని ముఖం అదో మాదిరిగా మారిపోయింది. అతనిలో ఎప్పుడూ లేని మార్పు ఏదో నాకు కనిపించింది.

పెళ్లి మాటలు జరిగాయి, ఎప్పటికయినా నా భర్త అతను అనే ధైర్యంతో అంత క్రితం రోజు నన్ను నేనతనికర్పించుకున్నాను. ఆనందపు టంచుల్ని అందుకుని, స్వర్గలోకాల్లో విహరించాము.

మరి? శేఖర మేమిటి ఇలా అదోమాదిరిగా వున్నాడు? కొంపదీసి, నన్ను మోసం చెయ్యడం లేదుకదా ఈ మనిషి?— నాకు కొంత భయం కల్గినమాట వాస్తవం...

అమ్మ లోపలికి వెళ్లినపుడు నా భయాన్ని అతని ముందుంచాను. అతని హృదయంమీద వాలిపోయి ఏడ్చేశాను.


నన్నతను వూరడించాడు. ఆ వూరడింపుతో ఎంతో ధైర్యం వచ్చింది. తర్వాత నన్ను నేనే చీదరించుకున్నాను, అనవసరమైన అనుమానాలతో ఎందుకు మనసు పాడుచేసుకుంటున్నానా అని నన్ను నేను తిట్టుకున్నాను.

నా భయం వట్టిభయం కాదనీ, నా అనుమానం వట్టి అనుమానం కాదని తెలియడానికి వారంరోజులు పట్టింది. ఈ వారంరోజులుగాను శేఖరం నాకు కనిపించలేదు.

అతని ఆఫీసుకి ఫోను చేశాను. సరోజకి ఫోన్‌చేశాను. ఇద్దరూ నాకు దొరకలేదు. నాకువచ్చిన ఉత్తరం నా అనుమానాన్ని దృఢంచేసింది.

ట్రాన్స్‌ఫరై వెళ్లిపోయినట్టు రాశాడు శేఖరం. ఎక్కడికో రాయలేదు. ఎప్పుడొస్తాడో రాయలేదు. నాకెందుకు చెప్పి వెళ్లలేదో రాయలేదు. ఇంకేమీ రాయలేదు.

నేను లేకపోతే. తను లేనన్నాడు. అంత ప్రాణంగా ప్రేమించిన నాతో



చెప్పి వెళ్ళడానికయినా తీరికలేదా ఈ మనిషికి ? కాదు, తీరిక లేకపోవడం కాదు. మోసం...శుద్ధ మోసం !

నేను మోసపోయాను. పూర్తిగా మోసపోయాను. అయినా ఇంకా ఏదో ఆశ. శేఖరం మోసం చేస్తాడంటే నమ్మకం కుదరని ఏదో పిచ్చిఆశ...నన్నింకా బ్రతికించింది.

మూడు నెలలు గడిచేసరికి తెలిసింది, పూర్తిగా మోసపోయానన్న విషయం. శేఖరం దగ్గరనుంచి ఉత్తరం లేదు. అతని అడ్రసు లేదు...సరోజ లేదు.

నేను గర్భవతిని...!

ఈ భయంకరమైన సత్యాన్ని నేనెలా దాచను ? శేఖరం దగాచేసిన విషయం రూఢియై పోయింది. అయినా చావాలని లేదు. ఇంకా బ్రతకాలనే వుంది. శేఖరం మీద కసి తీర్చుకోడానికి కాదు, అమ్మ కోసం ! అమ్మ బ్రతుకుకోసం !

అమ్మకి నా ముఖమెలా చూపించను ? అమ్మతో మాట్లాడ్డానికే సిగ్గుగావుంది. ఒళ్ళు కొట్టినట్టుగా వుంది. పరువుగల కుటుంబం ... మర్యాద ... గౌరవంగల కుటుంబం...నేను మచ్చతెచ్చిన దాన్ని. నన్ను పిరికితనం పెనవేసుకు పోయింది. భయంతో వూపిరి సలపక కొట్టుమిట్టాడి పోతున్నాను.

దిక్కుతోచని స్థితిలో డాక్టర్లని సంప్రదించాను. ఏ డాక్టరూ నాకు సాయపడలేదు. జనాభా పెరిగిపోతుందని

# వెలుగా చీకటీ

గోల పెట్టడమేగాని, పెరుగుదల ఆరి కట్టడానికి మహాత్ములు ముందుకు వస్తున్నా చేయూత నివ్వరీ డాక్టర్లు ! ఒకవేళ వాళ్ళు ముందుకు వస్తామన్నా ప్రభుత్వం ఆంక్షలు ! ఎలా తీరుతుంది జనాభా సమస్య ?

చివరికి తప్పలేదు. నాకు నేనుగానే రహస్యంగా ఒక మంత్రసాని నడిగి ఒక నాటుమందు తిన్నాను. అది నా ప్రాణం మీదికి తెచ్చింది.

హాస్పిటల్లో చేరక తప్పింది కాదు. నేను హాస్పిటల్లో చేరగానే రెక్కలు కట్టుకు వాలింది సరోజ. ఆమెను చూడగానే నాకు కొండంతధైర్యం వచ్చింది. ఆమెమీద నా అపోహ పూర్తిగా తొలిగి పోయింది.

నేను అడక్కుండానే తను చెప్పింది. శేఖరం వట్టి మోసగాడట. తను ఎంక్వయిరీ చేయగా తెలిసిందట !

ఇన్నాళ్ళా తను ఊరికి వెళ్ళిందట. పాపం, వాళ్ళ నాన్నగారికి బాగా సుస్తీ చేస్తే మెడికల్ లీవుమీద వెళ్ళి ఉద్యోగానికి రాజీనామా పంపించిందట. నా వార్త ఆమెకి ఎలా తెలిసిందో మరి... వెంటనే వచ్చి ఆదుకుంది. హాస్పిటలు వాళ్ళతో చెప్పి, నాకు అన్ని రకాల సదుపాయాలూ చేసింది. న్యాయస్థానం దృష్టి నామీద పడకుండా 'నన్ను నేను'గా మిగిల్చింది. ఆమె లేకపోతే నేను ఏమైపోయి వుండేదాన్నో! ఎప్పటి లాగా కన్య లాగా హాస్పిటల్నుండి విడుదలయ్యాను.

ఆ పరిసరాలు నన్ను చాలా బాధపెట్టసాగాయి. ఎప్పుడూ శేఖరం స్మృతులు నన్ను తినేస్తుండేవి. సరోజకి చెప్పుకున్నాను. ఆమె ఎవరినో పట్టుకుని నాకు ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయించింది.

అప్పటి నుంచీ ఇక్కడే పని చేస్తున్నాను. నన్ను ప్రాణంగా చూసుకుని ఎంతో సేవ చేసింది సరోజ. ఆమె రుణం నేను తీర్చుకోలేను.

ఆమె దగ్గరనుంచి ఉత్తరాలువస్తూనే వున్నాయి. ప్రతి ఉత్తరంలోనూ శేఖరం గురించి రాస్తూనే వుంది. అతని చెడు తిరుగుళ్ళ గురించి ఏకరువు పెడుతూనే వుంది. సరోజ రాసిన రాతలు చూస్తే ఎలాంటివారి మనసైనా విరిగి పోతుంది. అంత అసహ్యమైన అభిప్రాయం ఏర్పడుతుంది అతని మీద. ఏమిటో మరి? అంత జరిగినా శేఖరం మీద నాకింకా ఆశగానే వుంది! సరోజ శేఖరం ప్రవర్తన గురించి ఎంత హీనంగా రాస్తున్నా, అతనిమీద నా సదభిప్రాయం తొలగిపోవడం లేదు. నేను ప్రేమించిన మనిషతను. నే నతనికి అర్పించబడ్డాను. ఎప్పుడూ నేనతని మనిషినే ! నా ప్రేమ అలాంటిది. నా స్వభావం అలాంటిది.


అందుకే నన్ను తిడుతుంది సరోజ. కోప్పడుతుంది. మంచి చెడ్డా తెలుసుకోమని హితబోధ చేస్తుంది. నేను నవ్వడం కంటే ఏమీ చెయ్యలేకపోతాను. అది నా బలహీనతే!

* * *

సరోజ నాతో మూడు రోజులుంది. ఆ మూడు రోజుల్లోనూ ఏ మూడు గంటలో నాతో గడిపింది. తక్కిన సమయమంతా ఎక్కడెక్కడో వుండి వస్తోంది. ఈ మహా నగరమంతా ఆమె చుట్టాలే ! సరోజ అదృష్టవంతురాలు.

వెళ్ళేముందు అంది సరోజ...

'ఈ మూడు రోజుల్లోనూ నువ్వెంతగా చిక్కిపోయావో తెలుసా ? అదుగో ఆ అద్దం ముందు నిలబడు...నీకే తెలుస్తుంది' అని.



నేను విరక్తిగా నవ్వాను.

శేఖరం పెళ్ళివార్త నన్నిలా చేసిందని ఆమెతో ఎలా చెప్పను?

ఏ ముఖం పెట్టుకు చెప్పను?

శేఖరం పెళ్ళివార్త నాకు నిద్ర లేకుండా చేసింది. ఆకలి లేకుండాచేసింది. ఇవన్నీ మనసులో విషయాలు. ఆమెకి తెలిసేలా ఎలా చెప్పను? నా బాధ ఆమె అర్థం చేసుకోగల్గుతుందా? అన్నీ తేలిగ్గా తీసుకునే సరోజ; కష్టాల్ని నీటి బిందువుల్లా ఎంచుకుని తామరాకులా తిరిగే సరోజ, నన్నూ నా బాధని అర్థం చేసుకోగల్గుతుందా? ఎప్పటికి లేదు. నాకు ద్రోహం తలపెట్టిన వాడిపై యింకా వ్యామోహం వుంచుకున్నందుకు తిడుతుంది. కోప్పడుతుంది.

'ఏం మాట్లాడవేం...? అసలు నువ్వు భోజనం చేస్తున్నావా?'

అంది మళ్ళీ సరోజే, నేనేమీ మాట్లాడకపోయేసరికి...

నాకు మళ్ళీ ఏడుపొచ్చింది. ఆమెని కావలించుకుని ఏడ్చేశాను. అంతకంటే సమాధానం చెప్పడం నావల్ల కాకపోయింది.

సరోజ కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి. నాకు ఎంతో అద్భుతమనిపించింది. సరోజ కళ్ళల్లో మొదటిసారి నీళ్ళు చూడగల్గాను. నా మనసు కరిగిపోయింది. ఆమెను చాలా బాధపెట్టివుంటాననిపించింది.

'రాధా...నువు పెళ్ళిచేసుకోవా?'

అంది కళ్ళు తుడుచుకుంటూ సరోజ.

'అమ్మ నా పెళ్ళిచూసి చచ్చిపోతానంటుంది. అందుకే చేసుకోను...'

అన్నాను. ఎందుకో నవ్వొచ్చింది.

సరోజకి నా మనసు తెలియకనా? అలా అడిగింది? తెలుసు. అయినా ఏదో అడగాలి గనక అడిగింది.

'మీ అమ్మ చచ్చిపోతానంటుందని నువ్వు పెళ్ళిచేసుకోవు. ఆ తర్వాత నీ బ్రతుకుమీద నమ్మకం నీకు లేదు. నువ్వు మీ అమ్మ బ్రతుక్కోసమే బ్రతుకుతున్నావు కదూ...'

అంది జాలిగా సరోజ.

ఆమె మాటల్లో నాకేవో కొత్త ధ్వనులు వినిపించాయి. సరోజలో యింత



**వివాహమునకు ముందు-వెనుక**



పోయిన యవ్వనమును తిరిగి పొందండి. పురుషత్వం తక్కువ దాంపత్యజీవితంలో నిరుత్సాహం, స్వప్నస్ఖలితం, శీఘ్ర స్ఖలితం వంటి గుణములు గలవారు డా॥ చౌదరి గారిని సంప్రదించండి.

చౌదరీ డిస్పెన్సరీ,
కో-ఆపరేటివ్ బ్యాంకు ఎదుట,
ట్రంకు రోడ్డు, నెల్లూరు.
R. T. C. బస్ స్టాండు ఎదుట, మంగళగిరి రోడ్డు, గుంటూరు.



**మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు**

1 తెల్సుకోదగ్గవి:- మీ జీవితసుఖసంతోషాలకు మీరు తెలుసుకోదగ్గ అనేక వందల అద్భుత విషయాలు. రూ. 5-00
2. అద్భుత హాస్యకథలు:- మీరు నవ్వటానికి యితరులను బాగా నవ్వించటానికి కొన్ని వందల నవ్వించే కథలు. రూ. 3-50.
3. చేతిపనులు:- చిన్నపరిశ్రమలకు సర్కారు సంపాదనకు ఎన్నో రకాల సరుకులు, సులభంగా చేసుకోనే విధానాలు రూ. 3-50.
4. మంత్రశక్తి:- మీ కోర్కెలు నెరవేర్చుకోవటానికి వివిధమంత్రాలు వాటి అద్భుత రహస్యాలు సాధనమార్గాలు. రూ. 3-50.
5. జీవితరహస్యాలు:- మీ దాంపత్యజీవితాన్ని సంపూర్ణ ఆనందమయం చేసుకోవటానికి అనేక దివ్యకామసూత్రాలు రూ. 3-50
6. యువతి:- స్త్రీ అనుగురించి యువతీయువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహల విషయాలు రూ. 3-50.
7. సంతానము:- కామసుఖాలు అనుభవించుచు కూడ అవసరం లేనపుడు గర్భం రాకుండా 60 సులభమార్గాలు. రూ. 3-50.
వీటి రచన ఎ. యస్. మూర్తి, యం.ఏ. పోస్టుఖర్చులు ఉచితం. దేశసేవ ప్రచురణలు, ఏలూరు. 2, ఆంధ్రకు వ్రాస్తే మీకు కావలసినవి వి. పి. పోస్టుద్వారా పంపబడును.



**1970 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డు మీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండునెలల్లో జరుగు



ముఖ్య సంఘటనలు అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, పర్వీసులో ప్రమోషన్ & ట్రాన్స్‌ఫర్, పిల్లల జననం, వివాహం, సుఖ సంతోషాలు మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజి అదనం. ఒకదఫా చూచిన తృప్తి చెందగలరు.

PT. DEV DUTT SHASTRI
RAJ JYOTISHI (WAPM)
P.B. 86, JULLUNDUR CITY.


# వెలుగూ చీకటీ

మార్దత్వముందని నే నెప్పుడూ అనుకో లేదు.

ఆ మాటను తప్పించా లనిపించింది. నవ్వు కొనితెచ్చుకున్నాను. కృత్రిమంగా నవ్వాను. నవ్వి, అన్నాను...

'మరి నీ పెళ్ళెప్పుడు?'

అని...

'నీ పెళ్ళయ్యాకే నా పెళ్ళి' అంది మెట్లు దిగుతూ సరోజ.

నా దగ్గర సెలవుతీసుకుంటూ ఒక కవరు చేతిలో పెట్టి తను వెళ్ళిపోయాక చదువుకోమంది.

స్టేషన్లో ట్రయిను బయలుదేరి వుంటుంది ఈ పాటికి!

కవరు విప్పాను.

అదో శుభలేఖ!

శుభలేఖ కొట్టివేసివుంది. రెండో వైపు తిప్పాను. దానిమీద ఏమిటో రాసి వుంది. రాయడానికి కాయితం దొరక్క, పాత శుభలేఖ దేనిమీదనో రాసి వుంటుం దనుకున్నాను. చదివాను.

'రాధా,

నేను నీకు చాలా అన్యాయం చేశాను. వోర్వలేక నీకూ శేఖరానికి ఎడబాటు కల్పించాను. అతనిమీద రాయరాని రాత లన్నీ నీకు కల్పించి రాశాను. అతను నిన్ను విడిచి వెళ్ళిపోడానికి కారణం నేనే. నేనే అతన్ని నీకు దూరం చేశాను. నన్ను కాలదన్ని నిన్ను చేసుకోవడం సహించలేకపోయాను. అతన్ని మా నాన్న గారు మనిషిగా చేశారు. మా నాన్న మాట అతనికి వజ్రాయుధం! అందుకనే ఎటూ చెప్పలేక నీకు దూరమైపోయాడు శేఖరం. నాతో పెళ్ళికి ఒప్పుకోక తప్ప లేదు. చెప్పాను గా మా నాన్నంటే అతనికి అంతులేని భక్తి విశ్వాసాలని... మా పెళ్ళి శుభలేఖ ఇస్తూ నీలో చెప్పా లని వచ్చాను. కాని, అనుకున్నదొకటి, జరిగింది మరొకటి. నువ్వే నెగ్గావు. నయానో భయానో శేఖరం నన్ను పెళ్ళి చేసుకోవచ్చు. కాని అతడు నాకు భర్తగా న్యాయం చెయ్యలేడు. అతని మనసు తెలిసున్న నాకా విషయం బాగా తెలుసు. ఎప్పుడూ నిన్నే తలుస్తూ వుంటాడు. నువ్వు లేకపోతే అతను పిచ్చివాడై పోతాడేమో కూడా! ఇదే శుభముహూర్తానికి నీకూ శేఖరానికి పెళ్ళి జరిపించే భారం ఇప్పుడు నేను వహిస్తున్నాను. నా మనసు తిరిగిపోడానికి కారణం నువ్వే. శేఖరం అన్యాయం చేశాడని తెలుసుకుని కూడా నువ్వు అతన్ని ప్రేమిస్తున్నావూ అంటే నువ్వు నిజంగా దేవతవి. నీకు నే చేసిన అపరాధం మన్నించరానిది. మీ యిద్దరికీ పెళ్ళిచేసే భాగ్యం నాకు ప్రసాదించు. నా గురించి బాధపడకు. నేనూ పెళ్ళిచేసుకుంటాను, నీ పెళ్ళి అయ్యాక...

వుంటాను,
సరోజ.

నమ్మలేకపోయాను. శుభలేఖ చదివాను. నిజమే! శేఖరం సరోజలకి పెళ్ళిట!

ఈర్ష్యా ద్వేషాలు ఎంతెంతటి పనులు చేయిస్తాయో అప్పుడు నాకు తెలిసింది.

శేఖరం నాకు దేవుడులా కనిపించాడు. సరోజకూడా దేవత లానే కనిపించింది. సృష్టి యావత్తూ సర్వాంగసుందరంగా కనిపించింది.

నేను అదృష్టవంతురాల్ని.

అమ్మ కోరిక తీరుస్తున్నా నన్న మాట!

మనసులో ఏదో మూలకలుక్కు మంది.

'అమ్మా...అమ్మా' అంటూ లోపలికి పరుగెత్తాను.

అమ్మ నిశ్చలంగా నిద్ర పోతోంది.

గదిలో చీకటి...దీపం వున్నా తొలగిపోని చీకటి...!

బయట వెలుతురు...ఎంత కాదు చీకటి నన్నా తరమగల వెలుతురు!! ●